




నేటి నుండి మంటాడ శ్రీ వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు 2లో



18వ వసంతంలోకి... నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ - కృష్ణా
సోమవారం 10 మార్చి 2025 పేజీలు 8

# పీ4 కార్యాచరణలో భాగస్వాములుకండి



**ఆలోచనలు పంచుకోండి.. మార్పునకు నాంది పలకండి**

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మార్చి 09, బ్యూరో, మేజర్ న్యూస్ :** సమగ్రాభివృద్ధి లక్ష్యంగా గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర ఏ 2047లో భాగంగా పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు జీరో పావర్టీ-పీ4 విధానం అమలుకు కసరత్తు జరుగుతోందని.. ఈ ప్రయాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్రఏ2047 విజన్ డాక్యుమెంట్‌లోని పది సూత్రాల్లో మొదటి సూత్రమైన శూన్య పేదరికం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పీ4) విధానానికి ఉగాది నుంచి శ్రీకారంచుట్టనుందని.. ప్రభుత్వం, దాతలు, ప్రజాభాగస్వామ్యంతో పేదరికం లేని సమాజం లక్ష్యంగా ఈ పీ4 విధానం అమలుకానుందని వివరించారు. ముఖ్యంగా యువతకు జ్ఞానం, నైపుణ్యాలు అందించడం, ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు, సుస్థిర ఉపాధి అవకాశాల సృష్టి, వృద్ధికి దోహదం మిగతా 2లో

Scan me..

## విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలి

ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభసభ్యులు యార్లగడ్డ వెంకట్రావ్



వివరాలు 2లో

## అంగరంగ వైభవంగా.. అభయాంజనేయస్వామి 37వ వార్షికోత్సవం



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనుల శాఖ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారు. వారిని దేవస్థానం సిబ్బంది, అర్చక స్వాములు స్వాగతం పలికి అమ్మవారి కి విశేషమైన పూజలు చేయించి శాలువాతో సత్కరించి, శ్రీ అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదములను అందజేసినారు.

**దర్శించుకున్న 18 వేలమంది భక్తులు**

ఆదివారం సంధర్భంగా శ్రీ కొండలమ్మ అమ్మవారిని సుమారు 18,000 పైగా భక్తులు దర్శించుకున్నారని, అత్యధిక స్థాయిలో భక్తులు శ్రీ అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి, వారి యొక్క మొక్కుబడులు తీర్చుకున్నారని, శ్రీ అమ్మవారి 2లో..

తరలివచ్చిన వేలాది భక్తులు, క్యూలైన్లలో రద్దీ

శ్రీకొండలమ్మను దర్శించుకున్న మంత్రి కొల్లు రవీంద్ర

## వేణుగోపాల స్వామివారి దీవెనలు ప్రజలందరిపై ఉండాలి

స్వామి వారి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాము 2



(మొదటిపేజీ తరువాయి)

## పీ4 కార్యాచరణలో భాగస్వాములుకండి

చేసే మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించేందుకు ఇది తోడ్పడుతుందన్నారు. సమాజం నుంచి పేదరికాన్ని దూరం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికాయుతంగా చేపడుతున్న కార్యక్రమాలకు తోడు సామాజికంగా, ఆర్థికంగా పైన ఉన్న కుటుంబాలు సామాజిక బాధ్యతగా అట్టడుగున ఉన్న కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా భాగస్వాములను చేయడం పీ4 విధానమని పేర్కొన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంపై ప్రజల నుంచి సూచనలు తీసుకోవడం జరుగుతోందన్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి లేదా https://swarnandhra.ap.gov.in/p4 లింక్ ద్వారా ఈ నెల 25వ తేదీలోగా అభిప్రాయాలు తెలియజేసి.. ప్రతి ఇంటికీ అభివృద్ధి, ప్రతి జీవితానికీ ప్రగతిలో భాగస్వాములు కావాలని, మీ సలహాలను ప్రశంసిస్తూ ఒక ప్రశంసా పత్రం కూడా అందించడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

## అంగరంగ వైభవంగా అభయాంజనేయస్వామి 37వ వార్షికోత్సవం



దేవస్థానంనకు విచ్చేసిన భక్తులకు తాగునీరు, శానిటేషన్ ఏర్పాట్లు, ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకొనుటకు ఏర్పాట్లు పర్యవేక్షించినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలి పారు. శ్రీ కొండమ్మ అమ్మవారి దర్శనమునకు విచ్చేసిన భక్తులకు ఏ విధ మైన అసౌకర్యములు, అవాంఛనీయ, సంఘటనలు కలగకుండా గుడ్లవల్లేరు ఎస్ఐ, సిబ్బంది తగు బందోబస్తు ఏర్పాట్లు చేసారు.

**అభయాంజనేయస్వామి వార్షికోత్సవం :**

శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానమునకు దత్తత దేవాలయం అయిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం 37వ వార్షికోత్సవం సందర్భముగా ఆదివారం ఉదయం 6 గంటలకు స్వామివారికి స్నపన కార్యక్రమం అనంతరం సహస్ర నాగవల్లి ధర్మపూజ తదుపరి నీరాజనం మంత్ర పుష్పం చేసి, సాయంత్రం 6 గంటలకు స్వామివారికి శాంతి కళ్యాణ మహోత్సవం, తదుపరి గ్రామోత్సవం నిర్వహించామని, శ్రీ అభయాంజనేయస్వామిని భక్తులు దర్శించి తీర్థ ప్రసాదములు స్వీకరణచేసారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండల రావు తెలిపారు

## నేటి నుండి మంటాడ శ్రీ వెంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు



**పమిడిముక్కల మార్చి 9 మేజర్ న్యూస్ :** పమిడిముక్కల మండలం మంటాడ గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 10వ తేదీ నుండి 14వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వర్గం ప్రారంపర్య వ్యవస్థాపక కుటుంబ సభ్యులు అగస్తూరాజు రామ్మోహనరావు, కార్య నిర్వాహణ అధికారి ఆర్.మాధవి లత తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈనెల 10వ తేదీ సోమవారం ఉదయం స్వామివారిని పెళ్లి కుమారుని చేయుట, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే 11వ తేదీన ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం, 12వ తేదీన స్వామివారి కల్యాణం, 13వ తేదీన రథోత్సవం, 14 తేదీన





పవళింపుసేన సేవ తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా ప్రతిరోజు జరిగే నిత్య పూజా కార్యక్రమాల్లో పాల్గొనదలచిన భక్తులు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించవలసిందిగా కోరారు. ఈ కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలి

### ప్రభుత్వ విప్, శాసనసభసభ్యులు యార్లగడ్డ వెంకట్రావ్



**గన్నవరం, మార్చి 9, మేజర్ న్యూస్ :** గన్నవరం లోని బాలికల ఉన్నత పాఠశాలలో బాలోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని 38 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల నుంచి విద్యార్ధిని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ పిల్లలు చేస్తున్న దాన్సులు.. సాంస్కృతిక నృత్యాలు.. ఏకపాత్రాభినయాలు.. మట్టి బొమ్మల తయారీ.. బాలికల కోలాటం.. చూస్తుంటే ఇది బాలోత్సవమా.. బ్రహ్మోత్సవమా అన్న అనుభూతి కలుగుతుందని అన్నారు. విద్యార్థినీ విద్యార్థుల సర్వతో ముఖ అభివృద్ధికి వాళ్లలోని సృజనాత్మకతను వెలికితీయటానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్సీ ఎలక్షన్ కోడ్ వల్ల కార్యక్రమం కొద్దిగా ఆలస్యం అయిందని వెల్లడించారు. విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా రంగాల్లోనూ, కళాత్మక, సాంఘిక రంగాల్లో రాణించాలని అన్నారు. కేవలం చదువుకే పరిమితం కాకుండా ఆటలు, పాటలు, దాన్సులు వంటి రంగాల్లో రాణిస్తే మంచిదని పిల్లలకు సూచించారు. గన్నవరం నియోజకవర్గానికి మంచి చరిత్ర, గుర్తింపు ఉందని దానిని ఇనుమడింప చేసేందుకు తాను కృషి చేస్తున్నట్లు తెలిపారు. రానున్న మూడేళ్లలో 15 వేల మందికి ఉద్యోగాలు ఇప్పిస్తానని, అది చేసిన తర్వాతే మళ్ళీ ఓటు వేయమని ప్రజలను అడుగుతానని చెప్పారు. ఇప్పటికి భారతదేశంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రభుత్వ పాఠశాల వచ్చిన వారే చాలామంది ఉన్నారని హార్డ్ వర్క్ ను మించిన మంచి దారి ఏదీ లేదని చెప్పుకొచ్చారు. విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే అది హార్డ్ వర్క్ ద్వారానే సాధ్యమవుతోందని చెప్పారు. భావితరాలు ఇంజినీర్లు కావాలనే ఉద్దేశంతో దూరదృష్టితో ఆలోచించి మహనీయులు ఆంధ్రప్రదేశ్‌లో అధిక సంఖ్యలో ఇంజనీరింగ్ కాలేజీలు ఏర్పాటు చేసారని చెప్పారు.

ఆరోజుల్లోనే చంద్రబాబు నాయుడు, ఇంజనీరింగ్ కళాశాలు, హైటెక్ సిటీ ని నిర్మించి హైదరాబాదు అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఇతర కార్యక్రమాల్లోనూ పాల్గొనేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చూడాలని కోరారు. మంత్రి నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత విద్యాశాఖ సంస్కరణలకు బాట వేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో విద్య శాఖకు ప్రాముఖ్యత ఇవ్వకపోవడంతో ఈరోజు ప్రభుత్వ పాఠశాలలో ఈ దుర్భర పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడా కూడా గవర్నమెంట్ స్కూలు ను తీసేసే పరిస్థితి ఉండదని నియోజకవర్గంలో ఏ స్కూల్లో సమస్య ఉన్న మంత్రి లోకేష్ బాబు తో మాట్లాడి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని యార్లగడ్డ వెల్లడించారు.

# వేణుగోపాల స్వామివారి దీవెనలు ప్రజలందరిపై ఉండాలి



**గుడివాడ, మేజర్ న్యూస్:** వేణుగోపాల స్వామి వారి చల్లని దీవెనలు, ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. గుడివాడ పట్టణంలో ప్రసిద్ధిగాంచిన గీతభవన్ రోడ్డులోనీ శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానంలో ఈనెల 12వ తేదీ నుండి 14వ తేదీ వరకు జరగనున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవ వేడుకల ఆహ్వాన పత్రికలను గుడివాడ ప్రజావేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆవిష్కరించారు. ముందుగా వేద పండితులు ఎమ్మెల్యే రాముకు వేద ఆశీర్వచనాలు అందచేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ గుడుల వాడగా ప్రసిద్ధిగాంచిన గుడివాడలో అత్యంత పురాతనమైన శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానంలో జరగనున్న వార్షిక మహోత్సవాలు అత్యంత వైభవంగా జరగడంలో భాగస్వామ్యం అవుతానన్నారు. వేడుకల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు. గుడివాడలో ఆధ్యాత్మిక శోభను పెంపొందించే కార్యక్రమాలను తాను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తానన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలు జరుగుతాయని, ప్రధానంగా 13వ తేదీ సాయంత్రం 6 గంటలకు శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి, శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వార్ల కళ్యాణ మహోత్సవాలు జరుగుతాయని ఈవో గోపాలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్‌రావు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు బౌద్ధ సంప్రదాయాలతో బౌద్ధ గురువు బంతేజి భూమి పూజ



**ఘంటసాల, మేజర్ న్యూస్:** ఘంటసాల అంబేద్కర్ నగర్లో నూతనంగా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు బౌద్ధ సంప్రదాయాలతో బౌద్ధ గురువు బంతేజీ ఆదివారం భూమి పూజ చేశారు.దాతలు, అంబేద్కర్ నగర్ వాసుల ఆర్థిక సహకారం, సమన్వయంతో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠ, స్లాబ్ నిర్మాణాలకు బౌద్ధ గురువు బంతేజీ శంకుస్థాపన జరిపారు. గౌతమ బుద్ధుడు విగ్రహం, అంబేద్కర్ చిత్రపటం వద్ద విశేష పూజలు నిర్వహించారు. మొదట బౌద్ధ గురూ బంతేజీని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జ్ఞాపకతో సత్కరించారు. బంతేజీ మాట్లాడుతూ బౌద్ధం స్వేచ్ఛ, సమానత్వం,సౌభ్రాతృత్వాన్ని, చాటుతుందన్నారు. ప్రపంచశాంతి, దేశ అభివృద్ధికి గౌతమ బుద్ధుని బోధనలు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన విధానాల ద్వారానే సాధ్యమవుతుందన్నారు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎంతో శ్రమించి ఉన్నత చదువులు చదివి అహర్నిశలు శ్రమించి బహుజనులకు సమాజంలో నీడను కల్పించారని కొనియాడారు. అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి తమ వంతుగా బంతేజీ రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం



**గుడివాడ, మేజర్ న్యూస్:** ఫైనాన్స్ కంపెనీ వారి ఆగడాల తో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ కుటుంబానికి సహకార విజయవాడ సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ గా పనిచేస్తున్న నాళం వెంకటేశ్వరరావు ఆర్థిక సహాయం అందజేశారు. మోటూరుకు చెందిన రావి సత్తిబాబు ప్రవేట్ ఫైనాన్స్ కంపెనీలో అప్పు తీసుకొని ఆటో కొనుక్కుని జీవనం సాగిస్తున్నాడు. సకాలంలో అప్పు చెల్లించక ఫైనాన్స్ కంపెనీ వారి వేధింపులకు గురై బలవన్మరణం పొందినట్లు ప్రసారమాధ్యమాల ద్వారా దాత తెలుసుకున్నారు. వచ్చిన ప్రసారములను సహకార శాఖలో విజయవాడలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ గా పనిచేస్తున్న నాళం వెంకటేశ్వరరావు చూసి చనిపోయిన ఆటో డ్రైవర్ వారి కుటుంబ వివరములను, వారి ఆర్థిక పరిస్థితులను స్థానిక మోటూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పి.ఐ. సి.యన్.కనకరత్నమ్మ, సీనియర్ ఇన్స్పెక్టర్, సి.ఇ.ఓ. నారాయణ ద్వారా తెలుసుకుని ఆటోడ్రైవర్ భార్య అయిన రావి నాగ పద్మావతి ఆదివారం మోటూరులో వారి ఇంటివద్ద ఈ సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ సర్వీస్ వైస్ ప్రెసిడెంట్ మునిపల్లి మధుబాబు, ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ గుడివాడ తాలూకా యూనిట్ వైస్ ప్రెసిడెంట్ మహేష్, పి. ఏ. సి.ఎస్.గుమాస్తా యం.శాంతి పాల్గొన్నారు. ధైర్యము తో పరిస్థితులను అధిగమించి తన చిన్న పిల్లలకు మంచి భవిష్యత్ చూపించవలసినదిగా దాత కోరారు. ఎక్కడో విజయవాడ నుండి వచ్చి తన దానగుణమును చాటిన వెంకటేశ్వరరావుని గ్రామ పెద్దలు ప్రశంసించారు.

# ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పనులను 200 రోజులకు పెంచాలి



గన్నవరం, మార్చి 9, మేజర్ న్యూస్ : ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పనులను 200 రోజులు కు పెంచాలని, రోజువారీ కూలి 700/ రూపాయలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేశారు కృష్ణా జిల్లా గన్నవరం మండలం అల్లాపురం గ్రామ వ్యవసాయ కార్మిక సంఘం మహా సభ ఆదివారం ఉదయం మన్నెం గోపాలకృష్ణ అధ్యక్షతన అల్లాపురం గ్రామంలో దళిత వాడలోని అమరవీరుల స్థూపం వద్ద జరిగింది ఉపాధి హామీ పథకం పనులలో కాంట్రాక్టరులు యంత్రాలను ఉపయోగించి వద్దని ఆ మహాసభ డిమాండ్ చేసింది. పని ప్రదేశాల్లో కార్మికులు కు ప్రమాదంలో మరణించిన వారికి 10 లక్షల భీమా కురిపించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది అధ్యక్షునిగా మన్నెం గోవర్ధన్, ఉపాధ్యక్షులు గా మాదవరపు రంగమ్మ, కార్యదర్శిగా మాదవరపు వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా ఓరుగంటి నాగేశ్వరమ్మ, మన్నెం లెనిన్ కమిటీ సభ్యులు గా, మన్నెం గోపాలకృష్ణ, బడుగు గౌరీ శంకర రావు, మన్నెం లక్ష్మీ, మన్నెం జ్యోతి, మన్నెం సుభాషిణీ, మన్నెం శ్రీనువాసరావులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కొండా వీరాస్వామి, తిరివీది సుబ్బారావు, మన్నెం గోపాలకృష్ణ, బడుగు గౌరీ శంకరరావు, బొర్రా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## యధావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం



మచిలీపట్నం మేజర్ న్యూస్ : ఈనెల 10వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం యధావిధిగా నిర్వహిం చడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. శాసనమండలి ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్నందున కొంతకాలం పి జి ఆర్ ఎస్ (గ్రీవెన్స్) కు తాత్కాలిక విరామం ప్రకటించిన విషయం తెలిసిందే. ఎన్నికల ప్రక్రియ ముగిసినందున యధావిధిగా పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తామని, దీనిలో భాగంగా,కలెక్టరేట్లోని గ్రీవెన్స్ హాల్లో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. కలెక్టరేట్ తో పాటు డివిజనల్, మండల, మున్సిపల్, సచివాలయ స్థాయిలోనూ పిజి ఆర్ఎస్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ ఆ ప్రకటనలో కోరారు.

## ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**

విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని వెంటనే పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఈ సోమవారం కూడా విజయవాడ నగరపాలక సంస్థ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయంలో కూడా నిర్వహిస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ కు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గరలోని కార్యాలయంలో సంప్రదించవచ్చని ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1:00 వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులందరూ జోనల్ కార్యాలయలలో తో పాటు ప్రధాన కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంటారని, కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## ఈ నెల 10వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వినతుల స్వీకరణ కార్యక్రమం

**జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**

విజయవాడ, మార్చి 09, బ్యూరో, మేజర్ న్యూస్ : ఈ నెల 10వ తేదీ సోమవారం కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. జిల్లా కేంద్రంతో పాటు, డివిజన్, మండల కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.



## హిందూ స్మశాన వాటికలో 10 లక్షలతో సిమెంట్ రోడ్లు

గన్నవరం, మార్చి 9, మేజర్ న్యూస్ : గన్నవరం మండలం దావాజీగూడెం అల్లాపురం గ్రామాలకు చెందిన హిందూ స్మశాన వాటిక అభివృద్ధికి ప్రముఖ బిల్డర్ గుర్రం నాని ముందుకొచ్చారు. సొంత నిధులు రూ. 10 లక్షల రూపాయలతో మూడు సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. అల్లాపురం గ్రామానికి చెందిన నాని పెదనాన్న, పెద్దమ్మ గుర్రం సుబ్బయ్య, శేషారత్నం, భార్య రజనీ జ్ఞాపకార్థం ఈ అభివృద్ధి పనులు చేపట్టారు. కన్న తల్లిదండ్రులను, జన్మభూమిని మర్చిపోకూడదని పెద్దలు చెప్పిన మాటను ఆచరిస్తూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములు అయ్యామని తెలిపారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు హిందూ స్మశాన వాటిక అభివృద్ధికి ముందుగా సహకరించాలని కోరడంతో నాని వెంటనే స్పందించి ఖర్చుకు వెనుకాడకుండా పనులు వేగంగా చేయిస్తున్నారు. జీవితంలో ఎంత సంపాదించామనేది ముఖ్యం కాదని, సమాజ సేవకు ఎంత సహాయం చేశామనేది ముఖ్యమని భావించి ప్రజలకు ఉపయోగపడే సామాజిక సేవా కార్యక్రమాలకు సాయం అందిస్తున్నట్లు నాని తెలిపారు. సిమెంట్ రోడ్లు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం ద్వారా స్మశానం వాటికలో మౌళిక సదుపాయాల కల్పన జరుగుతుందని చెప్పారు. ఇప్పటికే అల్లాపురంలో ఓవర్హెడ్ ట్యాంక్, ఆర్ఓ మినరల్ వాటర్ ప్లాంట్ సొంత నిధులతో ఏర్పాటు చేశారు.అడిగిన వెంటనే స్పందించిన దాతకు గ్రామ పెద్దలు, బుద్ధవరం సర్పంచి బడుగు బాలమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

## సీపీఎం పార్టీ ప్రజా చైతన్య యాత్ర



ఏ.కొండూరు, మేజర్ న్యూస్: పాత కొండూరులో ఆదివారం సిపిఎం పార్టీ ప్రజా చైతన్య యాత్ర ప్రారంభమైంది. ఈ యాత్రలో పెద్ద బీడు లో తరాలు గా సాగు చేసుకుంటున్న మా భూములు ఆన్ లైన్ చేసి హక్కు కల్పించాలని సంవత్సరాలు తరబడి అధికారులు చుట్టూ తిరిగినా మా మొర ఆలకించటం లేదని దళితపేటలో ఉన్న పేద రైతులు, కూలీలు యాత్ర దృష్టికి తీసుకొచ్చారు. రైతులు తో కలిసి పెద్ద బీడు భూములు పరిశీలించి 1977లో ప్రభుత్వం ఇచ్చిన 45 ఎకరాల భూమిని తాము గత 48 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నామని, అయినా పట్టాలు ఇవ్వలేదని, ఆన్లైన్ లో నమోదు చేయలేదని, దానివల్ల ప్రభుత్వ పథకాలు పొందలేక పోతున్నామని, వెంటనే పట్టాలి ఇచ్చి ఆన్లైన్లో నమోదు చేయాలని కోరుతూ స్థానిక సమస్యలను ప్రజా చైతన్య యాత్రా బృందం దృష్టికి తీసుకువచ్చారు, దీనిపై పోరాట భూమిని సందర్శించి పోరాట కమిటీని ఎన్నుకున్నారు, మార్చి 24వతేది తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేయాలని నిర్ణయించారు. యాత్రా బృందంలో సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ డివికృష్ణ, మండల కార్యదర్శి కామ్రేడ్ పి ఆనందరావు, సిఐటియు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు, రైతు సంఘం మండల అధ్యక్షులు ఏ అమ్మిరెడ్డి, స్థానిక రైతు, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు, కార్యకర్తలు, పెద్దలు, రైతులు పాల్గొన్నారు.




## హైలక్స్ బ్లాక్ ఎడిషన్‌ను పరిచయం చేసిన టొయోటా కిర్లోస్కర్ మోటర్

గుంటూరు మేజర్ న్యూస్ : భారతదేశంలో కొత్త హైలక్స్ బ్లాక్ ఎడిషన్‌ను విడుదల చేస్తున్నట్లు టొయోటా కిర్లోస్కర్ మోటార్ ప్రకటించింది. ఇది ఒడిదుడుకుల రోడ్లు, రోజువారీ నగర వినియోగానికి, ఆఫ్-రోడింగ్ అడ్వెంచర్ డ్రైవ్‌లకు బాగా సరిపోయే అద్భుతమైన జీవనశైలి యుటిలిటీ వాహనాన్ని కోరుకునే కస్టమర్ల కోరికలను తీర్చడానికి, అభివృద్ధి చెందుతున్న కస్టమర్ అంచనాలను కొనసాగించడానికి రూపొందించబడింది. కొత్త హైలక్స్ బ్లాక్ ఎడిషన్ దాని సంప్రదాయ దృఢత్వం, శక్తి, పనితీరును నిలుపుకుంటూ దూకుడు, అధునాతనమైన ఆల్-బ్లాక్‌థీమ్‌ను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది.

## ముఖ్య జంక్షన్‌లలో ఆటో మేటిక్ సిగ్నలింగ్ సిస్టం

విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ : నగరంలో ఎన్. టి. ఆర్. జిల్లా పోలీస్ కమీషనర్ వారి ఆదేశాల మేరకు ముఖ్య జంక్షన్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. ఈ విషయం గుర్చి నగర ప్రజలకు ట్రాఫిక్ విభాగము తరుపున తెలియచేయునది ఏమి అనగా వాహన దారులు సిగ్నల్ జంక్షన్ల వద్ద రెడ్ లైట్ పడినప్పుడు తప్పని సరిగా వైట్ లైన్ వద్ద ఆగి వెళ్ళ వలెను అలా ఆగకుండా వెళ్ళినచో మీ యొక్క వాహనంను ఆటో మేటిక్ సిగ్నలింగ్ సిస్టం ద్వార రికార్డు చేయబడి కమాండ్ కంట్రోల్ వద్ద తప్పిదం గుర్తించి మీకు ఆన్ లైన్ ద్వారా చలానా వేయటం జరుగుతుంది. అంతే కాకుండా ఈ సిగ్నల్స్ ద్వారా వాహనదారులు మోటార్ వాహన చట్టానికి వ్యతిరేకంగా మరియే ఇతర తప్పిదాలు అనగా హెల్మెట్ ధరించకపోయిన, సీటు బెల్ట్ ధరించక పోయిన, ట్రిపుల్ రైడ్ చేసిన, సెల్ ఫోన్ డ్రైవ్ చేసిన, రాంగ్ రోడ్ డ్రైవింగ్ చేసిన, ఓవర్ లోడ్ తో వాహనంను నడిపిన, ఆటో డ్రైవర్లు ఖాకి షర్ట్ ధరించకపోయిన, మరియే ఇతర తప్పిదాలు చేసిన వాటిని పైన తెలిపిన ఆటో మేటిక్ సిగ్నలింగ్ సిస్టం ద్వారా రికార్డు చేసి మీరు చేసిన తప్పిదమునకు ఆన్ లైన్ ద్వారా చలానా వేయబడుతుంది. కావున నగరంలో వాహనదారులు పై విషయాలను గమనించి ఎటువంటి తప్పిదాలు చేయకుండా వాహన చట్టాలకు అనుగుణంగా వాహనాలు నడుపుచూ ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా మీ గమ్య స్థానాలు చేరుకోవాలని ట్రాఫిక్ విభాగం తరుపున తెలియచేయడమైనది.

## సారంగపాణిని పరామర్శించిన ఎమ్మెల్యే మండలి



అవనిగడ్డ, మేజర్ న్యూస్ : దివిసీమ సీనియర్ పాత్రికేయులు దీవి సారంగపాణి అయ్యంగార్‌ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, వారి తనయుడు మండలి వెంకట్రామ్ లు ఆదివారం పరామర్శించారు. ఇటీవల మోకాలి ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సారంగపాణిని కలిసి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## రామకోటి ఉత్సవాలలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ, మార్చి 9, మేజర్ న్యూస్: పట్టణంలో పాత కూరగాయల మార్కెట్ శ్రీ సీతారామాంజనేయ స్వామి (రామాలయం) దేవాలయంలో రామకోటి ఉత్సవాలలో భాగంగా శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి కూటమినేతలు భక్తజనులతో కలసి ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. వేద పండితులు ప్రత్యేక పూజలను నిర్వహించి సీతారాముల స్వామివారి అక్షిత తీర్థ ప్రసాదాలను తంగిరాల సౌమ్యకి అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## నేటి నుండి పులిగడ్డలో కనకదుర్గ అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ట మహోత్సవాలు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని పులిగడ్డ గ్రామంలో కొలువై యున్న శ్రీ కనకదుర్ల అమ్మవారి విగ్రహ జీవద్వజ పునః ప్రతిష్ట కుంభాభిషేక మహోత్సవాలు సోమవారం నుండి ప్రారంభిస్తున్నారని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు మండల వెంకటకృష్ణ రావు తెలిపారు.ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 75 లక్షల రూపాయలు పునర్మించిన కనకదుర్గాదేవి ఆలయంలో ఈ నెల 12వ తేదీ బుధవారం ఉదయం 11. 39 నిమిషాలకు ఆలయంలో కనకదుర్గాదేవి విగ్రహ ప్రతిష్టతో పాటు ధ్వజస్తంభం, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, వీరాంజనేయ స్వామి, నాగేంద్ర స్వామి, ఆలయ శిఖర ప్రతిష్ట జరుగుతాయని చెప్పారు. ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను త్రయాంహిక దీక్షతో ఆగమ పండితులు నందివెలుగు బాలాజి గురుకుల్ బ్రహ్మత్వంలో జరుగుతాయన్నారు. 10వ తేదీ సోమవారం మంగళ వాయిద్యాలు వేద పారాయణం, రక్షాబంధనం, గణపతి పూజ, లక్ష్మీ పూజ, ప్రతిష్ట మూర్తుల విగ్రహాల గ్రామోత్సవం. 11వ తేదీ మంగళవారం అర్చన, అగ్ని మదనం అగ్ని ప్రతిష్ట, మహోత్సవాల కతువులు జరుగుతాయన్నారు. 12వ తేదీ బుధవారము విగ్రహ ప్రతిష్ట మహోత్సవ అనంతరం భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

## అమ్మవారికి వెండి కిరీటం బహుకరణ



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** పులిగడ్డలో కొలువై ఉన్న కనకదుర్గాదేవి ఆలయంలో దుర్గమ్మకు హైదరాబాదుకు చెందిన తోట బాలాజీ ఈశ్వరి దంపతులు 55 వేల రూపాయలు విలువచేసే వెండి కిరీటము, పూజా వస్తు సామాగ్రిని బహూకరించారు.ఆదివారం అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు మండలి వెంకటకృష్ణారావు కు వెండి కిరీటం పూజా సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సీతారామ చంద్రమూర్తి దివ్య కళ్యాణం



**నందిగామ, మార్చి 9, మేజర్ న్యూస్:** పట్టణం శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో 72వ రామకోటి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు ఆదివారం సీతారామనామ సంకీర్తన సంఘం సభ్యుల పర్యవేక్షణలో ఆలయ అర్చక స్వాములు దివి రత్నమాచార్యులు అదోక్షయాచార్యుల ఆధ్వర్యంలో వైఖానస సంప్రదాయ పద్ధతిలో ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ వేదికపై సీతారామ చంద్రమూర్తి దివ్య కళ్యాణం అంగరంగ వైభవంగా వేదమంత్రోచ్చారణ నడుమ కన్నుల పండుగ జరిగింది. స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో నందిగామ పట్టణానికి చెందిన జయన రామ గోవిందు కవిత జయన సతీష్ జ్యోతిర్మయి దంపతులు కళ్యాణ మహోత్సవ లో పీటలపై కూర్చొనిపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. రామనామ సంకీర్తన నడుమ ఆలయం మారు మోగింది, ఉత్సవాల పురస్కరించుకొని గుంటూరు పట్టణానికి చెందిన మల్లాది కైలాసనాద్‌చే కూచేలోపాఖ్యానం, ఉపన్యాసం, నందిగామ శ్రీ బాలాజీ గణపతి సచ్చిదానంద దత్తాత్రేయ స్వామి భజన సమాజంతో భక్తి సంకీర్తనలు, విజయవాడ మాగులూరి త్రినాధ ఆచారి శిష్యబంధం జై కూచిపూడి భరత నాట్యం జానపద నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.



# అన్నపూర్ణ వృద్ధాశ్రమ నిర్వాహకురాలు 'కరెడ్ల సుశీల'కు అవార్డు







### అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ మహిళా శిరోమణి అవార్డు

### పలువురు ప్రముఖులచే ఘన సన్మానం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆపన్నులకు అమృత హస్తం అందిస్తూ, చేయూత లేని, నిరాదరణకు గురైన అనాధ మహిళలను ఆదరిస్తూ, నిత్యం వారి సేవలో తరిస్తూ, ఎందరో మాతృమూర్తులకు అండగా నిలుస్తూ, ఏ కష్టం వచ్చినా 'నేనున్నాను' అంటూ భరోసా ఇస్తూ, వారి పాలిట కల్పతరువుగా నిలుస్తూ నిరంతరం వారి సంక్షేమమే ధ్యేయంగా, అన్నపూర్ణ వృద్ధాశ్రమ నిర్వాహకురాలు కరెడ్ల సుశీల వృద్ధమాతలకు అత్యుత్తమ సేవలు అందిస్తున్నారు. గత 20 సంవత్సరములకు పైగా అన్నపూర్ణ వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తూ, ఎందరికో ఆసరాగా ఉంటూ, వృద్ధమాతల బ్రతుకుకు భద్రత, భరోసా, సంక్షేమాన్ని అందిస్తూ వారి సేవలో ముందుకు నడుస్తున్నారు కరెడ్ల సుశీల మాతృమూర్తుల సేవే నారాయణుడి సేవగా భావించి, నిత్యం ఆశ్రమంలో వారి సంక్షేమం కోసం పాటుపడుతున్న మహిళామణి సుశీల. సమాజ సేవకే తన జీవితాన్ని అంకితం ఇచ్చి మాతృమూర్తుల సేవలో తరించి జీవిస్తున్నారు. పిల్లల నిర్లక్ష్యానికి గురికాబడ్డ మాతృమూర్తులను చేరదీసి, వారిని అక్కున చేర్చుకొని, వారి సంక్షేమం, భద్రత కోసం అహర్నిశలు తపించే సుశీల అంటే అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో అందరికీ మక్కువే.వృద్ధమాతల ఆరోగ్యం, సంక్షేమం కోసం నెలకు రెండుసార్లు మెడికల్ క్యాంపులు నిర్వహించడం, ఆశ్రమంలోని మాతృమూర్తులకు నిరంతరం సేవ చేయడమే లక్ష్యంగా తాను కూడా ఆశ్రమం లోనే ఉంటూ, వారి యోగక్షేమాలను,ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అన్నపూర్ణ వృద్ధాశ్రమాన్ని అత్యంత సుందర,భరితంగా, నందనవనంగా, నడుపుతున్నారనడంలో అతిశయోక్తి లేదు.ఆశ్రమంలో నివసిస్తున్న ఏ మాతృమూర్తిని పలకరించినా చెమ్మగిల్లిన కళ్ళతో 'సుశీల మా అమ్మాయి కన్నా ఎక్కువ' అంటారు. అంతటి ప్రేమాభిమానాలు చూరగొన్న సుశీలను విడిచి వృద్ధమాతలు ఒక్క క్షణం కూడా ఉండలేమంటారు.ప్రతిరోజు వృద్ధులకు ఇచ్చే మెనూ, అత్యంత జాగ్రత్తగా అందించడం, శుచి, శుభ్రతతో కూడిన పౌష్టికాహారాన్ని అందించడం, వృద్ధులకు అవసరమైన మందులను అందించడం ఆమె నైజం. నిత్యం వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ వారితో కలిసి ఆడి పాడడం వృద్ధ మాతలలో నూతన ఉత్సాహాన్ని అందిస్తోందనడం నిర్వివాదాంశం. ఒక పలకరింపు, ఒక ఓదార్పు, వృద్ధులకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇస్తుంది. వారిలోని నిట్టూర్పును పోగొడుతుంది. ఏ పలకరింపుకు, ఓదార్పుకు, నోచుకోని మాతృమూర్తుల పట్ల ప్రేమ, కరుణ, వాత్సల్యం చూపుతూ వారి అభిమానానికి పాత్రులు కావడమే కాక, ఎందరో ప్రముఖుల అభిమానాన్ని చూర గొంటున్నారు.ఒక ఆశ్రమ నిర్వాహకురాలుగానే కాక, సామాజిక సేవతో బాటు, తెలుగుదేశం పార్టీలో అత్యంత చురుకైన మహిళా మణిగా గుర్తింపు పొందారు సుశీల.మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, మాజీ ఎంపీ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు తదితరులు వీరి సేవల్ని గుర్తించి కొనియాడడం జరిగింది. నగరంలో వీరు నిర్వహించే అన్నపూర్ణా వృద్ధాశ్రమం ఒక ఉద్యానవనంలో ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు.ఎవరిని విమర్శించకుండా,ఎవరితో మాట పడకుండా, అందర్నీ కలుపుకుంటూ, మిత స్మిత భాషినిగా అన్నపూర్ణ వృద్ధాశ్రమాన్ని అత్యంత సమర్థవంతంగా,నిర్వహిస్తున్నందుకు పలువురి మన్ననలు పొందారు.జిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ తదితర ప్రముఖులచే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ మహిళా శిరోమణి అవార్డు అందుకున్నారు. సేవా కార్యక్రమం చేయడం అంటే ఎంతో ఓర్పు, సహనం, ఉండి తీరాలి. అలా నేర్పుతో ఓర్పుతో చెరగని చిరునవ్వుతో, అన్నపూర్ణ వృద్ధాశ్రమాన్ని అత్యంత ప్రతిభతో నిర్వహిస్తున్న కరెడ్ల సుశీల అవార్డు పొందదగ్గ వ్యక్తే అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

## జీ ప్లస్ త్రీ ఇళ్ల నిర్మాణం సందర్శించిన సీపీఎం బృందం



**నందిగామ, మార్చి 9, మేజర్ న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సమస్యలపై ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఈరోజు నందిగామలో జి ప్లస్ త్రీ ఇళ్ల నిర్మాణం చేసిన హనుమంతుపాలెం గ్రామంలో సిపిఎం బృందం పర్యటించింది.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నందిగామ కార్యదర్శి కే గోపాల్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన జి ప్లస్ త్రీ నిర్మాణం 10సంవత్సరాలైనా ఇంతవరకు పూర్తికాకుండా ఉంది. నందిగామలో ఇల్లు లేని పేదలకు ఇల్లు ఇస్తామని చెప్పి.నిరుపేదల దగ్గర ప్రభుత్వం డిపాజిట్లు ద్వారా మున్సిపల్ అధికారులు వసూలు చేసి ఇంతవరకు ఎక్కడా కూడా ఒక జి ప్లస్ ఇల్లు ప్లాట్ కూడా ఇవ్వకుండా.కనీసం వారు ఇచ్చిన డబ్బులు సమాధానం కూడా చెప్పకుండా. లబ్ధిదారుల్ని ప్రభుత్వ అధికారులు ఇబ్బంది పెడుతున్నారు. అదే కాకుండా కొత్తగా బ్యాంకర్ల ద్వారా జి ప్లస్ త్రీ ఇల్లు పేరుతో మీరు బ్యాంకులో లోన్ తీసుకున్నారు మీరు లోన్ చెలించాలి అని చెప్పి లబ్ధిదారులకి నోటీసులు మెసేజ్ ద్వారా ఫోన్ ద్వారా లబ్ధిదారుల్ని భయాందోళన చేస్తు న్నారు బ్యాంకర్లు. అధికారులను అడిగితే మాకు సంబంధం లేదు అని అంటున్నారు. అంటే ప్రభుత్వం లబ్ధిదారుల దగ్గర డీడీలు రూపంలో డబ్బులు వసూలు చేసింది బ్యాంకర్ల దగ్గర కూడా లోన్లు తీసుకొని జి ప్లస్ నిర్మాణం పేరుతో మోసం చేసింది లబ్ధిదారులను.ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు తక్షణమే స్పందించి జి ప్లస్ త్రీ ఇల్లు కోసం ఎవరైతే డీడి రూపంలో చెల్లించారు. వాళ్ళందరికీ జి ప్లస్ త్రీ ఇల్లు ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాం.రాబోయే రోజుల్లో ఈ సమస్యలు పరిష్కరించకపోతే ప్రజలందరిని చైతన్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని అధికారులను డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం పార్టీ నందిగామ కమిటీ సభ్యులు సయ్యద్ ఖాసిం,కరి వెంకటేశ్వరరావు,జి గోపి నాయక్, హస్సన్, లాజరు, నాయకులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాల బాలికను అభినందించిన మంత్రి సుభాష్

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన వకృత్వ పోటీలలో జిల్లాలో రెండవ స్థానం పొందిన దావులూరి ఆలీ మోన్స (8వ తరగతి ప్రభుత్వ బాలికల పాఠశాల అంగలూరు )ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, జిల్లా ఇన్ఛార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ డికె బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జడ్పి చైర్మెన్ ఉప్పాల హారిక ల చేతుల మీదుగా జిల్లా పరిషత్ హాల్ మచిలీపట్నం లో అవార్డు అందజేశారు. ఉమెన్ ఎంపౌర్మెంట్ వారోత్సవాలలో నిర్వహించిన పోటీలలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని దావులూరి ఆలీ మోన్స పాల్గొని అవార్డు గెలుచుకోవడంపట్ల సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి సుభాష్ అభినందించారు. అవార్డు గెలుచుకుని పాఠశాల ప్రతిష్టను యినుమడింపచేసిన ఆలీ మోన్స ను ఎంఇఓలు జగన్మోహనరావు, గోపాలరావు ఉపాధ్యాయులు అభినందించారు.

# సేవలు మరింత విస్తరింపజేస్తాం

**దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ కాళ్లు**

**శ్రీ భగవన్ మహావీర్ వికలాంగుల సహాయ సమితి, ది ఛేంచింగ్ చారిటీ, హాసి ఫౌండేషన్**





**విజయవాడ మేజర్ న్యూస్ :** శ్రీ భగవన్ మహావీర్ వికలాంగుల సహాయ సమితి, ది ఛేంచింగ్ చారిటీ, హాసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవలు మరింత విస్తరింపజేస్తామని చారిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం విజయవాడ వన్ టౌన్‌లోని సివి రెడ్డి చారిటీ ట్రస్ట్ లో వికలాంగులకు జైపూర్ కృతిమ కాళ్ళు, చేతులు పంపిణీ చేశారు. అలాగే సుమారు 500 మంది రక్త దానం చేశారు. మణిపాల్ హాస్పటల్ వైద్యులుతో గుండె సంబంధిత సమస్యల పై ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ది చేంజ్ మేకర్ సంస్థ నిర్వాహకులు అంజు అగర్వాల్, ఆర్యన్ జైన్ లు మాట్లాడుతూ, అంగ వికలాంగులైన వారికి కృతమ అవయవాలు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా తమీ కార్యక్రమాన్ని ప్రారంభించా మని తెలిపారు. గత మూడు రోజులుగా ఈ కార్యక్రమం జరుగుతుందని సుమారు 225 మందికి కృతమ అవయవాలు సపోర్ట్ పరికరాలను అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వం కూడా తమకు సహకరించి నగరంలో అవసరమైన స్థలాన్ని కేటాయిస్తే జైపూర్లో వలె ఇక్కడ కూడా కృతమ అవయవాలను ప్రజలకు అందజేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అదే విధంగా రానున్న రోజుల్లో మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని సభ్యులు తెలిపారు. స్థానిక కార్పొరేటర్ మహాదేవ అప్పాజీ రావు మాట్లాడుతూ అతి చిన్న వయసులో సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వచ్చిన ది చేంజ్ మేకర్ సంస్థ నిర్వాహకులను అభినందించారు. స్థానిక ఎమ్మెల్యే ఎంపీలతో మాట్లాడి సంస్థ నిర్వాహకులు చేసే సేవా కార్యక్రమాలను వారికి వివరించి ప్రజలకు మరింత సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ది ఛేంచ్ మేకర్స్ సభ్యులు మీత్ సంఘ్వి, రాజ్ సింగ్, హిటీన్, క్రిష్, హాసి ఫౌండేషన్ సభ్యులు అనుజ్, అగర్వాల్, చిరగ్ జైన్, క్రిష్ జైన్, సరస్ జైన్, హర్ష తోషునివాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరికీ ఆరోగ్యమే మహాభాగ్యం





**నందిగామ, మార్చి 9, మేజర్ న్యూస్:** ఆరోగ్యమే మహాభాగ్యం అన్న పెద్దల మాటలు నేడు సమాజంలో ఎంతో అరుదైన పదాలుగా కనిపిస్తున్నాయని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు ఆదివారం నందిగామ పట్టణం కాకాని నగర్‌లో గల అమృత ఆర్థో క్లినిక్‌లో మణిపాల్ హాస్పిటల్ విజయవాడ వారి సౌజన్యంతో మెడికల్ లేబరేటరీ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్యాన్సర్ స్క్రీనింగ్, గుండె జబ్బులు ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, కూటమి నేతలతో కలిసి ఆమె ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మణిపాల్ హాస్పిటల్ వారు ఇటువంటి కార్పొరేట్ వైద్య సేవలను చుట్టుపక్కల గ్రామాల ప్రజానీకానికి అందించుటకు ముందుకు వచ్చినందుకు, ఈ ఆరోగ్య పరీక్ష శిబిరానికి సహాయ సహకారాలు అందించిన నందిగామ మెడికల్ లేబరేటరీ అసోసియేషన్ వారికి అభినందనలు తెలియజేసి ఇటువంటి చక్కటి అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి చైర్మన్ ఈపూరి నాగేశ్వరరావు, కార్యక్రమ నిర్వాహకుల ప్రతినిధి సురా బత్తుల కోటేశ్వరరావు, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సేవలో కాపా వారి కుటుంబ సేవలు చిరస్మరణీయం





**కాపా కుటుంబ సభ్యులకు కృతజ్ఞత తెలిపిన గ్రామస్తులు**

**పక్కగ్రామాల వారు కూడా ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలి**

**ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

**నందిగామ, మార్చి 9, మేజర్ న్యూస్:** మండలంలోని కమ్మవారిపాలెం గ్రామంలో ఆదివారం కాపా రామ సీతమ్మ ప్రేరణతో కుమారులు కాపా కృష్ణ ప్రసాద్, కాపా రవీంద్రనాథ్, కాపా భాను ప్రసాద్ 3 లక్షల రూపాయలతో ఏర్పాటుచేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, గ్రామ సర్పంచ్, గ్రామస్తులు, కూటమినేతలతో కలిసి ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ నా చిన్నతనం బాల్యం మొత్తం కాకతీయ విద్యాసం స్థలోనే పూర్తి చేశాను.మా గురువు కాపా రవీంద్రనాథ్ కి నా హృదయపూర్వక అభినందనలు. తల్లి మాట జవదాటని కుమారులు కాపా వారి కుటుంబం రామ సీతమ్మ ప్రేరేపణతో గ్రామ దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చిన కాపా వారి సోదరులకు శుభాకాంక్షలు. గతంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు



గ్రామ ప్రయోజనార్థం బస్ షెల్టర్ ను ప్రారంభించాను ఈరోజు ఆర్వో వాటర్ ప్లాంట్ ను ప్రారంభించడం జరిగినది. కమ్మవారిపాలెం గ్రామం అంటే నాకు ప్రత్యేకమైన అభిమానం కమ్మవారిపాలెం గ్రామ రూపురేఖలను మార్చి అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తాను. మరలా ఎన్నికలకు వచ్చేనాటికి గ్రామాభివృద్ధిని చేసి మీ ముందుకు వస్తా, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మన నేతగా అభివృద్ధి ప్రదాతగా ఉండటం మనం చేసుకున్న అదృష్టం, చంద్రబాబు నాయుడు ఆలోచన ఎప్పుడూ గ్రామాలకు మౌలిక సదుపాయాలను కల్పించాలనే ఉంటుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 8 మాసాల కాలంలోనే ఆంధ్రప్రదేశ్ అంతటా గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ గా రహదారులను అభివృద్ధి చేశాము. చుట్టుపక్కల గ్రామాల వారు కమ్మవారిపాలెం గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలని తెలియజేశారు. అనంతరం కాపా రామ సీతమ్మ ని ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.



## నూతన దంపతులను ఆశీర్వదించిన విక్కుర్తి.

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** నూతన దంపతులు వెంకట లక్ష్మి, వెంకట శివాంజనేయులను పారిశ్రామికవేత్త, కూటమి నాయకులు విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు ఆశీర్వదించారు. అవనిగడ్డ శివారు కొత్తపేట కి చెందిన బొప్పన గురు వెంకట చలపతిరావు ( లేటు ), రాధా ( లేటు ) దంపతుల కుమార్తె వెంకటలక్ష్మి తుంగలవారిపాలెం వాస్తవ్యులు సనకా నాగేశ్వరరావు, వీర కుమారి దంపతుల కుమారుడు వెంకట శివాంజనేయులు ల వివాహం ఈనెల ఆరవ తేదీ గురువారం ఉదయం వేకనూరులోని శ్రీ సంతాన వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగింది. పెళ్లి కుమార్తె బాబాయ్ బొప్పన ఏలీషా బాబు, పావని దంపతుల ఆహ్వానం మేరకు వివాహ రిసెప్షన్ కు హాజరైన విక్కుర్తినూతనవధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో విక్కుర్తి రాంబాబు, వధూవరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతిర్మయిని దీవించిన మాజీ ఎమ్మెల్యే సింహాద్రి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** స్థానిక టిటిడి కళ్యాణ మండపం లో ఆదివారం జరిగిన తుంగల శ్రీనివాసులు కృష్ణకుమారి మేనకోడలు చిన్నారి దాశినేని జ్యోతిర్మయి నూతన వస్త్ర బహూకరణ వేడుకలో పాల్గొన్న మాజీ శాసనస భ్యులు సింహాద్రి రమేష్ బాబు చిన్నారి ని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు సింహాద్రి వికాస్, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష, చింతలపూడి బాలు గరికి పాటి కృష్ణారావులతో పాటు పలువురు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారులకు గమనిక

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ విద్యుత్ వినియోగదారులు సహకరిం చాలని ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి కృష్ణ నాయక్ ఒక ప్రక టనలో కోరారు 10వ తేదీ సోమవారం అవనిగడ్డ నాగాయలంక రోడ్డులో గల కొత్త సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ తుంగాలవారి పాలెం విద్యుత్ లైన్ల పైన వాలిన చెట్ల కొమ్మలను తొలగించేందుకు మండల పరిధిలోని గుడివాడ వారి పాలెం వేకనూరు తుంగలవారిపాలెం గ్రామాలలోని గృహాలకు, వ్యవ సాయ మాటలకు ఉదయం ఏడు గంటల నుండి 11 గంటల వరకు విద్యు త్ అంతరాయం కలుగుతుందని ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

## 200 మందికి రంజాన్ తోఫా పంపిణీ



ఏ కొండూరు, మార్చి 9 మేజర్ న్యూస్ : నిరుపేదలకు ఆపన్న హస్తం అందించడమే తమ ధ్యేయమని దాత ఆబిదా పేర్కొన్నారు. మండలంలోని తిరువూరులో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రంజాన్ తోఫా పవిత్ర రంజాన్ మాసంలో నిరుపేద ముస్లిం సోదరులకు అందిస్తున్నామని ఈ పంపిణీ కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభించామన్నారు. శుక్రవారం ఉపవాస దీక్షపరులకు ఇఫ్తార్ విందు కూడా ఏర్పాటు చేశామని అలానే రంజాన్ తోఫా కూడా పంపిణీ చేసినట్లు తెలిపారు. రంజాన్ నెలలో నిరుపేదలను గుర్తించి వారికి అవసరమయ్యే నిత్యవసర సరుకులను, రంజాన్ తోఫాను అందజేయనున్నట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాల నుంచి తమ వంతుగా రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నిరుపేదలకు సహాయ సహకారాలు అందిస్తున్నామని దాతతెలిపారు.

## నలుగురికి ఆదర్శంగా నిలవాలి



కంచికచర్ల మార్చి 9 మేజర్ న్యూస్ : స్థానిక జుజ్జూర్ రోడ్ లో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన వేమూరి రెస్టారెంట్ ను ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెస్టారెంట్ అభివృద్ధి చెంది పదిమందికి జీవనోపాధి కల్పించి నలుగురికి ఆదర్శంగా నిలవాలి అని ఆకాంక్షించారు.ఈ మేరకు రెస్టారెంట్ యాజమాన్యానికి సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, కంచికచర్ల మండల దేశం పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు,అన్నదాత రామకృష్ణ, గుత్తా రమేష్ తదితర నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## సామినేని సమక్షంలో జనసేనలో పలువురి చేరిక




జగ్గయ్యపేట మార్చి 9 మేజర్ న్యూస్ : విజయవాడ, ఆటోనగర్, పలు డివిజన్లకు చెందిన ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీలకు చెందని వారు జనసేన పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆలోచనలకు, ఆశయాలకు ఆకర్షితులై ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను నాయకత్వాన్ని బలపరుస్తూ కొండవీటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో జగ్గయ్యపేటలోని ఉదయభాను స్వగృహంలో జనసేన పార్టీ లో చేరారు. వారికి సాదరంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను. నగరంలో ఇంకా జనసేన పార్టీ క్షేత్ర స్థాయిలో బలపడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ బడిత శంకర్, 15 డివిజన్ అధ్యక్షులు గాదిరెడ్డి అమ్ములు పాల్గొన్నారు.

## బస్సు ఢీకొనడంతో వృద్ధుడు మృతి



గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ : సైకిలు పై వెళుతున్న 84 సంవత్సరాల వృద్ధుడిని వెనుకనుండి ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో సంఘటనా స్థలంలోనే మృతిచెందిన సంఘటన కౌతరంలో జరిగింది. వివరాల్లోకి వెళితే గుడ్లవల్లేరు మండలం చంద్రాల గ్రామానికి చెందిన ఆతుకూరి వెంకట రామరాజు(84) సైకిలు పై వెళుతుండగా కౌతరం శివారు ప్రాంతంలో ఏలూరు నుండి మచిలీపట్నం వెళుతున్న ఆర్టీసీ అద్దె బస్సు ఏపి39టిఏఫ్ 4431 వెనుకనుంచి ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమైన రామరాజు సంఘటనాస్థలంలోనే మృతిచెందినట్లు, కేసు నమోదుచేసి డ్రైవరును, బస్సును అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్ వి వి సత్యనారాయణ తెలిపారు.

# ఏపిబిఎస్‌టి ఏ దర్బార్‌లో 30 రోజులు ఇఫ్తార్ విందు



ఏ.కొండూరు మేజర్ న్యూస్: పవిత్ర రంజాన్ మాసంలో ఏడవరోజున అజ్మీర్లో వేంచేసి ఉన్న ప్రముఖ సూఫీ మహనీయులు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చిష్తియా పరంపర సూఫీ గురువు, దక్షిణాసియాలోనే ప్రస్థానం పొందిన మహనీయులు హుజూర్ హజరత్ ఖ్వాజా మొయినుద్దీన్ చిష్తి వారి లంగర్ షరీఫ్అన్న సంతర్పణ–మహా దివ్య అన్న సమారాధన జంపని ఏ ఏ బి ఎస్ టి ఏ దర్బార్ లో నిజాం బాబా వారి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిజాం బాబా మాట్లాడుతూ మానవాళిని నీతి, ప్రేమ వైపు నడిపించడానికి దేవుడు మహనీయులను పంపుతారన్నారు. గరీబ్ నవాజ్ మహాత్ముల వారి సందేశం అసాధారణమైన లక్షణాన్ని కలిగి ఉంటాయని సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను సంతోషపెట్టే అన్ని ఆరాధనలలో ఉత్తమమైనది వినయపూర్వకమైన, అణగారిన వారికి ఉపశమనం కలిగించడమేనని బోధించారు. మోక్షాన్ని కోరుకునేవారు, తీర్పు రోజున శిక్ష నుండి రక్షణ కోరుకునేవారు పేదలు, ఆకలితో ఉన్నవారి అవసరాలను తీర్చాలనేది గరీబ్ నవాజ్ వారి ఉపదేశం అని తెలిపారు. భగవంతుని స్మరణ తప్ప తన హృదయానికి ప్రియమైనది ఏదీ ఉంచుకోని వారు జ్ఞానోదయం పొందిన వారు అవుతారని వారు బోధించారు. గరీబ్ నవాజ్ వారి బోధన మన దేశంలో జాతీయ సమైక్యత, సోదరభావం, ప్రేమకు మార్గదర్శకులుగా మారిన ఇతర చిష్తి సూఫీలకు ఆధారం అయ్యిందని నిజాం బాబా పేర్కొన్నారు.వారి ఉపదేశాలను, త్యాగాన్ని, సత్య జీవన విధానాన్ని గుర్తుచేస్తూ వారి బోధనలు ప్రపంచానికే ఆదర్శం అని, అన్ని మతాల వారు అజ్మీర్ లో వారి దివ్యసమాధిని దర్శించడం ఇస్లాంమతంలోగల సూఫీ తత్వం విశాలతత్వాన్ని నిరూపిస్తుందని ఆస్థాన అతా ఏ బాగ్ ఏ సర్కార్ తాజుల్ ఔలియా దర్బార్ జంపని లో సజ్జాదా అల్ ఖాద్రియ అతా ముహమ్మద్ నిజాముద్దీన్ నిజామి షా తాజ్ ఖాదరీ ఉద్బోధించారు. ఉపవాస దీక్షను ఆచరించే వారికి ఏడవ రోజు పోషకమైన ఇఫ్తార్ విందు, కుల, మత, జాతి, వర్గ భేదం లేకుండా అందరికి లంగర్ షరీఫ్ – మహా దివ్య అన్న సంతర్పణ ఘనంగా నిర్వహిస్తున్నట్లు, రంజాన్ మాసం 30 రోజులు ఉపవాస దీక్ష లో ఉన్నవారితో పాటు కుల, మత భేదం లేకుండా అందరికి అన్న సమారాధన దైవ కృపతో, సూఫీ మహనీయులు గురుదేవులు హజరత్ సూఫీ ఖ్వాజా ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బోగ్దాదీ బాబా చీమలపాడు వారు ప్రసాదించిన విశేష దివ్య ఆశీస్సులతో ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్లు అతా నిజాం బాబా తెలిపారు.

# పదవులకు వన్నె తెచ్చిన గొప్ప నాయకుడు రమణయ్య నాయుడు





మచిలీపట్నం మేజర్ న్యూస్ : పదవులకు వన్నె తెచ్చిన గొప్ప నాయకుడు రమణయ్య నాయుడు అని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు అన్నారు. ఆదివారం మచిలీపట్నంలో మాజీ శాసన సభ్యులు, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్, న్యాయవాది, సంఘ సంస్కర్త, కృష్ణా కో ఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ స్వర్గీయ రావు బహుద్దూర్ కొల్లిపర వెంకట రమణయ్య నాయుడు 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రేవతి సెంటరులో వారి విగ్రహ ప్రాంగణంలో నూతన విగ్రహ ఏర్పాటు, విగ్రహ ప్రాంగణం ఆధునికరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నూతన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, మచిలీపట్టణం ఎంపీ వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ళ బుల్లయ్య, జనసేన మచిలీపట్టణం నియోజకవర్గ ఇంచార్జి బండి రామకృష్ణ విచ్చేసి కొల్లిపర వెంకట రమణయ్య నూతన విగ్రహం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రమణయ్య నాయుడు నూతన విగ్రహానికి, చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం ప్రతినిధులు సీనియర్ న్యాయవాది కేవీఎస్ రమణమూర్తి, బీజేపీ ఇంచార్జి సోడిశెట్టి బాలాజీ, ప్రముఖ న్యాయవాదులు లంకిశెట్టి బాలాజీ, కూనపరెడ్డి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర నాయకులు పంతం గజేంద్ర, మాజీ కౌన్సిలర్ బొర్రా సుధాకర్, కొల్లిపర రవి శేష రమణ, చలమలశెట్టి వెంకట్రావు, కొల్లిపర సోమశేఖర్ పాల్గొన్నారు.

## హిందువులపై ముస్లింలు దాడులను తీవ్రంగా ఖండించిన కృష్ణ



అవనిగడ్డ, మేజర్ న్యూస్ : హిందువులపై ముస్లింలు చేసిన దాడులను విశ్వహిందూ పరిషత్ కృష్ణాజిల్లా మఠ మందిర్ సహ ప్రముఖ్ అన్నపరెడ్డి కృష్ణ తీవ్రంగా ఖండించారు. ఆదివారం పులిగడ్డ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల నాలుగవ తేదీ అన్నమయ్య జిల్లా రాయచోటిలో వీరభద్ర స్వామి ఆలయ పార్వేటి ఉత్సవం ఊరేగింపు సందర్భంగా హిందువులపై ముస్లింలు దాడి చేయడం దురదృష్టకరమని పోలీసులు ముస్లింలను అదుపు చేయడంలో విఫలం అవడమే కాకుండా పక్షపాత ధోరణిలో హిందువులపై అమానుషముగా లాఠీ చార్జీలు చేసి వారిని తీవ్రంగా గాయపరిచారన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఉత్సవంగా చేసుకున్న తరుణంలో ముస్లింలు దాడి చేయడం, దానికి పోలీసులు రక్షణ చర్యలు చేపట్టకపోవడం విశ్వహిందూ పరిషత్ తీవ్రంగా ఖండిస్తుంది అన్నారు. రాయచోటిలో ఊరేగింపు జరిగినందుకు అన్ని అనుమతులు తీసుకొని ఉత్సవాలు నిర్వహిస్తుంటే ఆ ఉత్సవానికి ఆటంకాలు కలగకుండా చూడవలసిన బాధ్యత పోలీసులదే అని ప్రశాంతంగా తమ ఉత్సవాలను తాము జరుపుకుంటూఉంటే హిందువులను హిందూ సంస్థలను బాధ్యులను చేస్తూ కేసులు పెట్టడం తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు ఈ విధముగా ముస్లింలు దాడి చేయడం రాష్ట్రంలో తొలిసారి కాదని గత సెప్టెంబర్ లో చిత్తూరు జిల్లాలోని వికోటలో కృష్ణాజిల్లా పెడన లో కూడా హిందువులపై వారి ఉత్సవాలపై ముస్లింలు ఈ విధముగా దాడులు చేయడం పరిపాటిగా మారింది అన్నారు. ముస్లింలు దాడులు చేస్తుంటే వారి మానసిక పరిస్థితిని పోలీసులు గుర్తించకపోగా దాడులు జరిగిన ప్రతిసారి హిందువులను బాధ్యులను చేసే ప్రయత్నం చేయటం పోలీసుల వైఫల్యం గా విశ్వహిందూ పరిషత్ భావిస్తుందన్నారు ఈ సంఘటన జరిగిన సందర్భంలో రాయచోటి అర్బన్ స్టేషన్ ఎస్ఐ జె నరసింహారెడ్డి హిందువుల ను రెచ్చగొట్టే విధంగా ఆయన ప్రవర్తన ఉందని హిందువుల ఉత్సవాలు ఊరేగింపుల సందర్భంగా ముస్లింలు హిందువులపై దాడులు చేస్తారని భయముతో హిందువుల ఉత్సవాలపై రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు ఆంక్షలు పెంచడానికి తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు ఇటువంటి సంఘటనలు మరలా పురావతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ 10వ తేదీ సోమవారం ఉదయం కృష్ణా జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందించనున్నామన్నారు.



## చలో పిఠాపురం విజయవంతం చేయండి

పామర్రు మార్చి 9 మేజర్ న్యూస్ : ఈనెల 14 తేదీన పిఠాపురం నియోజకవర్గం చిత్రాడ గ్రామంలో జరుగునున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా పామర్రు నియోజవర్గ పార్టీ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్ పిలుపునిచ్చారు. ఆదివారం పామర్రు పార్టీ కార్యాలయంలో ఈ మేరకు ఆయన నియోజకవర్గంలోని నాయకులతో కలిసి గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామర్రు నియోజవర్గం నుండి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ ఆవిర్భావ దినోత్సవ సభకు తరలి వెళ్లేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అధికారంలోనికి వచ్చాక మొదటి ఆవిర్భావ దినోత్సవ సభ కావడంతో పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఛలో పిఠాపురం పేరుతో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తోట్లవల్లూరు మండల అధ్యక్షులు శనివారపు కృష్ణ సుమన్, పమిడిముక్కల మండల అధ్యక్షులు సనక కిరణ్, రాపర్ల ఎంపీటీసీ సభ్యులు కూనపరెడ్డి సుబ్బారావు, జిల్లా కార్యదర్శి అంబటి రాజలక్ష్మి, పెదపారుపూడి మండలం నాయకులు పోలిశెట్టి సురేష్, పరేం వినోద్, మేడిశెట్టి నాగరాజు, కాకర్ల చైతన్య, విశాల్ పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హత్యకేసులో నలుగురు నిందితుల అరెస్టు






## న్యాయవాదే ఈ కేసులో ప్రధాన ముద్దాయి

**పామర్రు మార్చి 9 మేజర్ న్యూస్:** కూచిపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో ని కాజ గ్రామంలో జరిగిన హత్య కేసులో న్యాయవాదితో పాటు మరో ముగ్గురు ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు గుడివాడ డి.ఎస్.పి వి. ధీరజ్ వినీల్ తెలి పారు. గ్రామంలోని సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొవ్వ మండలం కాజ గ్రామంలో ఈనెల 5వ తారీఖున జరిగిన రాజులపాటి వెంకట రాజేష్ (27) హత్య కేసులో నలుగురు ముద్దాయిలు అరెస్ట్ చేసి న్యాయ స్థానంకు హాజరు పరిచినట్లు చెప్పారు. హత్యానంతరం మృతదేహాన్ని కాలువలో పడేసేందుకు వినియోగించిన కారును కూడా స్వాధీన పరచుకున్నట్లు తెలిపారు. ఈ హత్య కేసులో ప్రధాన సూత్రదారుడుగా పేర్కొనబడుతున్న తాతా హరికృష్ణ మృతుడు రాజేష్ పై ఉన్న పాత కేసులను రాజీ చేయిస్తామని నమ్మబలికి పాత కక్షలను మనసులో పెట్టుకుని చంపాలని నిర్ణయించుకుని రాజులపాటి వెంకట రాజేష్ ను హత్య చేసినట్లుగా డిఎస్పీ తెలిపారు. న్యాయవాద వృత్తిలో ఉన్న ముద్దాయి తాతా హరికృష్ణ తో పాటు మరో ముగ్గురు పథకం ప్రకారమే కొట్టి కాలువల పడేసినట్లు తెలిపారు. నిందితులైన తాతా హరికృష్ణ న్యాయవాదిగా ఉంటూ ఇంటికి వచ్చిన రాజేష్ పై నే దాడి నిర్వహించి ఇంటి వద్దనే హత్య చేయడం జరిగింది. రాజేష్ చనిపోయినట్లుగా ధ్రువీకరించుకున్న అనంతరం మృతదేహాన్ని కాలువ లో పడ వేసేందుకు న్యాయవాది కారునే వినియోగించినట్లుగా తెలిపారు. రాజేష్ హత్య లో సహకరించిన జోగి శివన్నారాయణ, మందా మధుసూధన రెడ్డి, బొల్లా శ్రీనివాసరావులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

హతుడు రాజేష్ తల్లి రాజులపాటి రామలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పామర్రు సిఐ వి.శుభాకర్ దర్యాప్తు చేసి హత్యకు ఉపయోగించిన ఏపీ39ఎల్ వై 7114 స్విఫ్ట్ డిజైర్ కారు, కర్ర, ఇనుప రాడ్ ను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ హత్యా సంఘటనకు పాల్పడిన నిందితులను మొవ్వ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు లో హాజరు పరచగా మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారని డిఎస్పీ తెలిపారు. కాగా కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించి త్వరితగతిన చేదించి, నిందితులను అరెస్ట్ చేసిన సర్కిల్ ఇన్స్పెక్టర్ వి శుభాకర్, సహకరించిన కూచిపూడి ఎస్సై సుబ్రహ్మణ్యం, ఏఎస్ఐ శోభన్ బాబు, హెడ్ కానిస్టేబుల్ మోహన్ రావు, కానిస్టేబుల్ ప్రమోద్, గోపి, నరసింహలను ఈ సందర్భంగా డిఎస్పి ధీరజ్ వినీల్ అభినందించారు.

# పేదలను ఆదుకునేందుకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధం...





**పామర్రు మార్చి 9 మేజర్ న్యూస్ :** అనారోగ్యం బారిన పడి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేదలను ఆదుకునేందుకు తమ కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు సంసిద్ధంగా ఉంటుందని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పామర్రులోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క పేదవాడిని ఆదుకునేందుకు తమ ప్రభుత్వం వివిధ పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు వైద్య సహాయ నిమిత్తం ఆర్థిక సహకారాన్ని అందిస్తు న్నామన్నారు. ఇది మంచి ప్రభుత్వమని అందుకు నిదర్శనమే పేదలను ఆదుకునే విధంగా వివిధ మార్గాలలో చేయూతనిస్తూ ఉండటమన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని 23 మంది లబ్ధిదారులకు 19 లక్షల 65 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారు. పామర్రు మండలంలో పామర్రు చెందిన ఆరేపల్లి రెడ్డమ్మకు 36,888 రూపాయలు, జుజ్జువరం కు చెందిన జన్ను వెంకటేశ్వరరావుకు 1,03,652, పామర్రు చెందిన బొమ్మారెడ్డి విజయా రెడ్డికి 15వేలు, చలపతి సామ్రాజ్యం కు 30,786, పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన కారేటి ఏడుకొండలుకు 44,406 రూపాయలు, పమిడిముక్కలకు చెందిన సుంకర లక్ష్మీ ప్రసాద్ కు 1,87,375 రూపాయలు, వేల్పూరు గ్రామానికి చెందిన రత్నం జగదీశ్వరరావుకు 40వేలు, వీరంకి గ్రామానికి చెందిన తాతినేని నాగమల్లేశ్వరి కి 60వేలు, పెదపారుపూడి మండలం మోపర్రు గ్రామానికి చెందిన దేవనబోయిన సుజాతకు 30,786, పెదపారుపూడి కి చెందిన జాలపాటి జమీమాకు 45వేల రూపాయలు, తోట్లవల్లూరు మండలం కుమ్మమూరు గ్రామానికి చెందిన బండి లక్ష్మీ పద్మావతికి 30,900, యాకమూరు గ్రామానికి చెందిన షేక్ షకీరున్నీసాకు 25వేలు, తోట్లవల్లూరు కు చెందిన ఆకునూరు సాయిరాంకు 28 వేలు, కోళ్ల జయ గణేష్ కు 50వేలు, మొవ్వ మండలం భట్లపెనుమర్రు గ్రామానికి చెందిన మానేపల్లి నాగభూషణంకు 75,734 రూపాయలు, మొవ్వ నాగేంద్రంకు 32,100 రూపాయలు, కాజ గ్రామానికి చెందిన నందం లక్ష్మీకాంతంకు 37,983 రూపాయలు, కాజ మందపాలెం కు చెందిన కొమ్ము అంజలికి 19వేల రూపాయలు వంతున అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పార్టీ నాయకులు జన్ను శోభన్ బాబు, జక్కా శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# శివారు గ్రామాలను విలీనంచేసి మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలి



**గుడివాడ, మేజర్ న్యూస్:** గుడివాడ శివారు గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేసి వెంటనే మునిసిపల్ ఎన్నికలు నిర్వహించాలని భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాకులు వై.వి.మురళీ కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. శివారు గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం కోసం 2019లో అప్పటి మునిసిపల్ కమిషనర్ ప్రజాభిప్రాయం కోరి పబ్లిక్ నోటీసు జారీచేసినట్టు చెప్పారు. అప్పుడే భవిష్యత్ భద్రతా దళం ఆద్వర్యంలోనూ ప్రజాభిప్రాయ సేకరణచేసి వివరాలను అప్పటి ఆర్డీవోకు అందజేశామన్నారు. అయితే అప్పటి ప్రతిపక్ష టీడిపి పార్టీ సభ్యులు మునిసిపల్ ఎన్నికలు జరగకుండా కోర్టుకి వెళ్ళడం వలన ఈ విలీన కార్యక్రమానికి అంతరాయం కలిగిందన్నారు. అయితే గుడివాడ శివారు ప్రాంతాలవారు గుడివాడ మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నా వారికి మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలం అయ్యారన్నారు. ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రావడంతో పార్టీ ప్రజా ప్రతినిధులు కోర్టు కేసుకుని వెనక్కి తీసుకుని వెంటనే మునిసిపల్ ఎన్నికలు జరిపించాలన్నారు. దీనికి ముందే శివారు ప్రాంతాలను మునిసిపాలిటీలో కలిపి అభివృద్ధి చెయ్యాలి కోరారు. లేనిచో ప్రజా పోరాటం ద్వారా కోర్టులో కేసు పరిష్కారం కొరతామన్నారు. శివారు గ్రామాలు గుడివాడ మున్సిపాలిటీలో కలిపి మునిసిపల్ ఎన్నికలు నిర్వహించే వరకు భవిష్యత్ భద్రతా దళం పోరాటం చేస్తుందని వై.వి.మురళీ కృష్ణ మరోసారి హెచ్చరించారు.

## వల్లూరుపాలెం లో ఉచిత వైద్య శిబిరం నిర్వహణ



**తోట్లవల్లూరు మార్చి 9 మేజర్ న్యూస్ :** తోట్లవ ల్లూరు మండలం వల్లూ రుపాలెం గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిం చారు. గ్రామంలోని హెల్పింగ్ హాండ్స్ స్వచ్చంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో విజయవాడ సెంటినీ హాస్పిటల్ కు చెందిన వైద్య సిబ్బంది పాల్గొని ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వరరావు, అధ్యక్షులు బడుగు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి మక్కిన సుబ్రహ్మణ్యం పర్య వేక్షణలో హాస్పిటల్ కు చెందిన డాక్టర్ కాగిత కృష్ణచంద్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజు తె లుగుదేశం పార్టీ అధ్యక్షులు జిల్లా అధ్యక్షులు, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, తోట్లవల్లూరు మండలం పార్టీ అధ్యక్షుడు వీరపనేని శివరాం, ఆచంట కోటేశ్వరరావు, లంక వెంకటేశ్వరరావు, వాడపల్లి సమీర్, చిట్టి బొమ్మ వెంకటశివరావు, జుజ్జువరపు సద్గుణరావు, హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు పాల్గొని తమ సహకారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్తె మాట్లాడుతూ కుమార్ రాజా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో గత 15 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సేవలను అభినందించారు. అలాగే గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు ఉచితంగా వైద్య శిబిరాలను నిర్వహించి వారికి తోడ్పాటునందించడం అభినందనీయమని పేర్కొన్నారు.

## ప్రతి ఇంటికి మంచినీరు అందాలన్నదే మా సంకల్పం



**జగ్గయ్యపేట: మార్చి 9 మేజర్ న్యూస్ :** పట్టణంలోని స్థానిక హెడ్ వాటర్ వర్క్సులో 60హెచ్ పి కొత్త మోటర్ ను స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజ గోపాల్ మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పుడో 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన 60,40 హెచ్ పి మోటర్లు ప్రతిసారి మరమ్మత్తులకు గురవడంతో మంచినీటి సరఫరా సరిగా అందడం లేదని ఫిర్యాదులు రావడంతో కొత్త 60 హెచ్ పి మోటర్ ను ఆదివారం ప్రారంభించడం జరిగిందని,దీని ద్వారా పట్టణానికి రోజు 30 లక్షల లీటర్ల మంచినీరు అందించే అవకాశం ఉందని, అలాగే గత పాత మోటార్స్ తో పోలిస్తే ఎక్కువ కెపాసిటీతో,తక్కువ వ్యవధి లోనే ఎక్కువ కుటుంబాలకు నీటి సరఫరా అందజేసే అవకాశం ఉందని, ఇంతకుముందు 24 గంటలు మోటార్ వేయాల్సిన అవసరం ఉండేదని ఇప్పుడు కనీసం రోజుకు ఒక గంట సేపు మోటారుకు విశ్రాంతిని ఇచ్చే అవకాశం ఉందని తెలియజేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కొత్త మోటర్, పాత మోటర్లు రెండిటిని అందుబాటులో ఉంచామని, ప్రతి ఇంటికి రోజూ మంచి నీటి సదుపాయం అందేల చర్యలు తీసుకుంటున్నామని తెలి యజేశారు. ఈ కార్యక్రమంలో మైనేని రాధాకృష్ణ,కన్నెబోయిన రామలక్ష్మి, కంచేటి గీతారాణి, సంగెపు బుజ్జిబాబు, నకిరకంటి వెంకట్,ఇర్రి నరసిం హారావు, పేరం సైదేశ్వర రావు, కర్ల జోజి, కటికల అనిల్, సయ్యద్ అన్వర్, మెడక కోటేశ్వరరావు, గింజుపల్లి కృష్ణ, మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్, మున్సిపల్ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రజాస్టార్ హాఫీజ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



**నందిగామ, మార్చి 9, మేజర్ న్యూస్:** పట్టణంలోని జామ (పెద్ద) మసీదులో రజాస్టార్ ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రొప్రైటర్ మహమ్మద్ హాఫీజ్ మిత్ర బృందం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాఫీజ్ మాట్లాడుతూ రంజాన్ మాసం సమాజంలోని భక్తి,భావం, పవిత్రత, సేవా సంప్రదాయం, కట్టుబాట్లకు నిదర్శనం ఇదాయిత్ అంటే ముస్లిం సోదరులు తనతోపాటు పేదవారికి సహాయం చేయాలని ఇస్లాం చెప్పిన ప్రకారం మనందరం ఒకరికొకరు చేతోడు వాదోడులుగా ఉండాలన్నారు. ఆదివారం సాయంత్రం మగ్రిబ్ నవాజ్ అనంతరం భారీ లంగర్ ఏర్పాటుచేసి రంజాన్ మాసం శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, హాఫీజ్ మిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.

# వోల్వో నూతన ఎక్స్ సి 90ను మార్కెట్లోకి విడుదల







**విజయవాడ మేజర్ న్యూస్ :** భారత్‌లో తన వాటాను పెంచుకోవడానికి తహతహలాడుతున్న స్వీడన్ లగ్జరీ కార్ల కంపెనీ వోల్వో మరో కొత్త మోడల్ నీ మార్కెట్లోకి విడుదల చేసింది. ఆటోమొబైల్ దిగ్గజంగా పేరు ఉన్న వోల్వో తన నూతన వేరియంట్ వోల్వో ఎక్స్ సి 90ను నిడమానూరులోని కృష్ణ వోల్వో షోరూంలో విడుదల చేసిందని నగర పోలీస్ కమిషనర్ ఎస్వి.రాజశేఖర్ బాబు తెలిపారు. ఇది ప్రపంచంలోనే అత్యంత సురక్షితమైన కార్లలో ఒకటని, దీని డిజైన్‌ని ఒకసారి చూస్తే మళ్లీ మళ్లీ చూడాలనిపిస్తుందని చెప్పారు. విజయవాడ నగరానికి సమీపంలోని నిడమానూరు వద్ద ఉన్న కృష్ణా వోల్వో తన కొత్త వోల్వో ఎక్స్ సి 90ను ఆదివారం విడుదల చేసింది.

ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా హాజరైన నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, వోల్వో సీఈవో మౌలిక గార్గ్‌తో కలిసి వోలు ఎక్స్‌సి 90 కారును లాంఛనంగా విడుదల చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఇది ప్రపంచం లోనే అత్యంత సురక్షితమైన కార్లలో ఒకటని, దీని డిజైన్‌ని ఒకసారి చూస్తే మళ్లీ మళ్లీ చూడాలనిపిస్తుందని చెప్పారు. ఆటోమొబైల్ దిగ్గజం తన నూతన వేరియంట్ వోల్వో ఎక్స్ సి 90ను నగరంలోని కృష్ణ వోల్వో షోరూంలో విడుదల చేసిందని, దీని ధర కోటి మూడు లక్షల రూపాయలుగా ఉందని తెలియజేశారు. ఎవరైనా చూడగానే ఆకర్షించే విధంగా సరికొత్త వేరియంట్‌తో వోల్వో ఎక్స్ సి 90 తయారైందని, అధునాతన సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకున్న వోల్వో ఇటువంటి నూతన మోడల్‌ను మార్కెట్‌లోకి విడుదల చేయడం ముదావహం అన్నారు. కస్టమర్లను ఎంతగానో ఆకర్షించే రీతిలో దీని మోడల్ ఉందని చెప్పారు.

ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ దేశంలో వోల్వో కంపెనీ మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.. రాష్ట్రంలో ఈ కంపెనీకి కావలసిన సహకారం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.. ప్రపంచంలోని సేఫెస్ట్ కారుల కంపెనీలో వోల్వో మంచి స్థానంలో ఉంటుందన్నారు. అనంతరం మౌలిక గార్గ్ మాట్లాడుతూ ఈ సంవత్సరంలో వోల్వో మరింత అభివృద్ధి దిశగా వెళ్లడం ఖాయమన్నారు.. ఈ నూతన కారు డిజైన్ చూపరులను ఎంతగానో ఆకర్షిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999

## పులిగడ్డ ఆక్విడెక్ట్ రెయిలింగ్ పనులు పరిశీలించిన ప్రాజెక్ట్ చైర్మన్



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** పులిగడ్డ ఆక్విడెక్ట్ రెయిలింగ్ పనులను తూర్పు కృష్ణా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దేవన బోయిన వెంకటే శ్వరరావు ఆదివారం సా యంత్రం పరిశీలిం చారు. అవనిగడ్డ శాసన సభ్యులు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ కృషితో ఆక్విడెక్ట్ సమగ్ర అభి వృద్ధి పనులు వేగవంతంగాజరుగుతున్నాయని ఆయన తెలిపారు. వీరి వెంట ఇరిగేషన్ శాఖ డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, కోడూరు మండల జనసేన అధ్యక్షులు మర్రే గంగయ్య, ఉల్లిపాలెం నీటి సంఘ అధ్యక్షులు ఇజ్జినేని శివాజీ, పూతబోయిన కరుణకుమార్, బాసు శివప్రసాద్, దేవనబోయిన కేశవ తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ సాధికార సారధుల నియామకంపై సమావేశం



**విజయవాడ మేజర్ న్యూస్ :** కుటుంబ సాధికార సార దుల నియామకంపై పార్టీ రాష్ట్ర నాయకత్వం అధిక ప్రా ధాన్యత ఇచ్చి అమలు చేస్తోందని తూర్పు నియోజ కవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. అందువల్ల ప్రతి నాయకుడు ఈ కుటుంబ సాధికార సారధుల నియామ కాన్ని సీరియస్‌గా తీసుకోవాలని చెప్పారు. పట మట అ శోక్ నగర్‌లోని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాల యంలో కుటుంబ సాధికార సారదుల నియా మకాలపై ఆదివారం ఉదయం సమావేశం జరిగింది. ఈ సందర్భం గా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ కుటుంబ సాధికార సారధులు చాలా కీలకమని చెప్పారు. ప్రతి 60 ఓట్ల రేంజ్‌కు ఇద్దరు కుటుంబ సాధికార సార ధులు ఉండాలని చెప్పారు. స్టేట్ కమిటీ, పార్లమెంట్ కమి టీ, నియోజకవర్గ కమిటీ, డివిజన్ కమిటీ, క్లస్టర్, యూ నిట్, బూత్ ఇంచార్జ్ ఉండాలన్నా కచ్చితంగా కుటుంబ సాధికార సారదులుగా తప్పని సరిగా ఉండాలని చెప్పారు. ప్ర తి 30 ఓట్లకు కుటుంబ సాధి కార సా రదులు పూర్తి బాధ్యత తీసుకో వాల్సి ఉంటుందని చెప్పారు. కు టుంబ సాధికార సారధులుగ నియమించబడే వారికి తప్పనిస రిగా మెంబర్ షీప్ ఉండాలని, వారికి కేటా యించిన ఓటర్లకు కుటుంబ సాధికార సారదులు నిరంతరం అందు బాటులో ఉండాలని చెప్పారు. ప్రతి 60 ఓట్ల రేంజ్‌కు ఒక పురుషుడు, ఒక మహిళ కుటుంబ సాధికార సారధులుగా ఉండాలని,. మంత్రి నారా లోకేష్ ఈ విధానంపై చాలా నిశితంగా పరిశీలిస్తున్నారని, అందువల్ల ప్రతి ఒక్కరూ ఈ కేఎస్ఎస్ సిరియస్‌గా తీసుకోవాలని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. ఈ విధానంలో ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే పార్టీ కార్యాలయాన్ని సంప్రదించాల్సిదిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చెన్నుపాటి గాంధీ, షేక్ ఫిరోజ్, జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, చెన్నుపాటి ఉషారాణి, దేవినేని అపర్ణ, చెన్నుపాటి కాంత్రి శ్రీ, పార్టీ డివిజన్ అధ్యక్షులు పలువురు నాయకులు పాల్గొన్నారు.

